# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వ ప్రోత్సహకాలతో రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**
2. **మాతృ భాషను భావితరాలకు అందించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**
3. **ఏలూరు జిల్లాలో 223 కోట్ల రూపాయలతో పలు గ్రామాభివృద్ధి పనులు చేపడతామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధ సారధి తెలిపారు.**
4. **గ్రామ, వార్డు సచివాలయాలలో పనిచేసే ఉద్యోగుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది.**
5. **తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రత్యేక దర్శనానికి సంబంధించిన టికెట్లను తిరుమల తిరుపతి దేవస్థానం ఈరోజు ఆన్ లైన్‌లో విడుదల చేసింది.**
6. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

ప్రభుత్వ ప్రోత్సహకాలతో రాష్ట్రానికి భారీగా పరిశ్రమలు వస్తున్నాయని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మంత్రి ఈ రోజు దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల మంత్రి మాట్లాడుతూ, స్వామి వారి ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. పరిశ్రమలు వస్తేనే ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు.

--------------------------

మాతృ భాషను భావితరాలకు అందించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిన్న జరిగిన అంత్యానుప్రాస నిఘంటువు ఆవిష్కరణలో రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలకు తల్లి భాషను దగ్గర చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. అనంతరం డి.పురందేశ్వరి మాట్లాడుతూ, అన్నింటికి తల్లి భాషను వాడాలని అవసరానికి

మాత్రమే అన్యభాష ను వాడాలని పేర్కొన్నారు.

---------------------------

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద ఏలూరు జిల్లాలో 223 కోట్ల రూపాయలతో పలు గ్రామాభివృద్ధి పనులు చేపడతామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధ సారధి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులోని బోర్వంచలో నిన్న నిర్వహించిన గ్రామ సభలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ, ఉపాధిహామీ కూలీలలకు ఆర్థిక భరోసా, సుస్థిర ఆస్తుల కల్పన కోసం గ్రామ సభలను నిర్వహిస్తున్నామన్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 547 గ్రామ పంచాయితీల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహించి ఆయా గ్రామాలలో సమస్యలను పరిష్కారిస్తామని చెప్పారు. 20 కోట్ల రూపాయలతో నూజివీడు నియోజకవర్గంలో రహదారులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

గ్రామ, వార్డు సచివాలయాలలో పనిచేసే ఉద్యోగుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాల స్థాయిలోనే బదిలీలకు అవకాశం ఉందని, బదిలీ కోరుకుంటున్న ఉద్యోగులు ఈ నెల 27లోపు అధికారిక వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఉంటుందని తెలిపింది. ఈ నెల 29, 30 తేదీల్లో బదిలీల కౌన్సిలింగ్‌కు దరఖాస్తు చేసుకున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు హాజరు కావాల్సి ఉంటుందని, పాలనా కారణాలు ఉంటే ఏ ఉద్యోగినైనా తప్పనిసరిగా బదిలీ చేసే అధికారం కూడా జిల్లా కలెక్టర్ లకు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏ ఉద్యోగి తమ స్థానిక గ్రామ, వార్డుల్లో పోస్టింగ్ కోసం దరఖాస్తు చేయకూడదని, విభిన్న ప్రతిభావంతులు, వితంతువులు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లు మించి పని చేసిన వారు బదిలీకి అర్హులుగా ప్రభుత్వం పేర్కొంది.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రత్యేక దర్శనానికి సంబంధించిన టికెట్లను తిరుమల తిరుపతి దేవస్థానం – టిటిడి ఈరోజు ఆన్ లైన్‌లో విడుదల చేసింది. నవంబర్ నెలకు సంబంధించి 300రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను ఈరోజు ఉదయం 10 గంటలకు విడుదల చేసింది. అలాగే ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు వసతి గదుల కోటా, వృద్దులు, దివ్యాంగులు కోటా టికెట్లను విడుదల టిటిడి చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా టికెట్లను నమోదు చేసుకోవాలని టిటిడి కోరింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 113వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్క్స్, ఏఐఆర్ న్యూస్ వెబ్ సైట్ ద్వారా న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారం కానుంది. మన్ కీ బాత్ హిందీ ప్రసంగం ప్రసారమైన వెంటనే అన్ని ఆకాశవాణి ప్రాంతీయ భాషల్లో దీని అనువాదం ప్రసారం అవుతుంది.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 11 నుండి ఆన్లైన్ ద్వారా ఇసుక పంపిణీకి చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లను ఆదేశించారు. నిన్న విజయవాడ నుండి దృశ్య మాధ్యమం

ద్వారా ఇసుక పంపిణీ పై సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్బంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, జిల్లాలలో ఇసుక పంపిణీ లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు నమోదు కేంద్రాలు  ఏర్పాటు చేయాలని తెలిపారు. ముందుగా వచ్చిన వారికి టోకెన్ సౌకర్యం ద్వారా ఇసుక సరఫరా చేయాలని , టైం స్లాట్ టోకన్ల ప్రకారం ఇసుక పంపిణీ జరగాలని సూచించారు. సెప్టెంబర్ 11వ తేదీ నుండి ఆన్‌లైన్ ద్వారా ఇసుక కేటాయింపులు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు.

---------------------------

పంటల విస్తీర్ణం, పోషకాల లభ్యత, ఎరువుల వినియోగం ఆధారంగా 2024-25 రబీ కాలానికి గాను 22.30 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల్ని కేంద్ర వ్యవసాయశాఖ రాష్ట్రానికి కేటాయించిందని రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఇందులో 9.4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 2 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ, 90 వేల మెట్రిక్ టన్నుల పొటాష్, 9 లక్షల మెట్రిక్ టన్నుల కాంపెక్స్, లక్ష మెట్రిక్ టన్నుల సూపర్ ఫాస్ఫేట్ ఎరువులున్నట్టు పేర్కొన్నారు. రబీలో వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి సుమారు 43.57 లక్షల హెక్టార్లలో పంటసాగవుతుందని తెలిపారు. కాంప్లెక్స్ ఎరువుల వాడకం వల్ల పంట ఎదుగుదల, దిగుబడి నాణ్యత పెరుగుతుంది అని ఎస్.ఢిల్లీరావు తెలిపారు.

---------------------------

వైద్యవిద్య పీజీ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్స రానికి ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పీజీ-2024 ఫలితాలు నిన్న విడుదలయ్యాయి. ఈ నెల 11న దేశవ్యాప్తంగా నీట్ పీజీ ప్రవేశ పరీక్షలు నిర్వహించగా దేశవ్యాప్తంగా రెండులక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

ఇలా ఉండగా మరోవైపు రాష్ట్రంలోనిప్రభుత్వ వైద్య కళాశాలల్లో 37 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీల్లో 488 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక బోర్డు  నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రత్యక్ష, పార్శ్వ ప్రవేశ విధానాల్లో ఈ భర్తీ చేపట్టనుంది. అర్హులైన వైద్యులు ఎఎవ.ఖజూ.అఱఎ.అఅ లో సెప్టెంబర్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.

---------------------------

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన హస్తకళాకారుడికి అరుదైన గౌరవం దక్కింది. ప్యారిస్ నగరంలో జరిగే పారా ఒలంపిక్స్ ముగింపు వేడుకల కార్యక్రమంలో పాల్గొనేందుకు శ్రీకాళహస్తికి చెందిన కలంకారీ కళాకారులు వేలాయుధం శ్రీనివాసులు ఆహ్వానం అందుకున్నారు. సెప్టెంబర్ 5వ తేది నుంచి 9వ తేది వరకు జరగనున్న పారా ఒలంపిక్స్ వేడుకల్లో భారతదేశంలోని ఐదు రాష్ట్రాల నుంచి ఐదు విభిన్న కళలలో ప్రతిబావంతులైన 5గురు కళాకారులు ప్రదర్శనలో పాల్గొనేందుకు అవకాశం దక్కింది. వారిలో రాష్ట్రం నుంచి వేలాయుధం శ్రీనివాసులను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ సందర్బంగా  శ్రీనివాసులు ఆకాశవాణితో మాట్లాడుతూ..

..వాయిస్...

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి

ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....

---------------------------

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి కలిగించాలని శ్రీకాకుళం శాసన సభ్యులు జి. శంకర్ ఉపాధ్యాయులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లా కళింగపట్నంలోని ప్రభుత్వ పాఠశాలలో నిన్న నిర్వహించిన అంతర్జాతీయ అంతరిక్ష దినోత్సవంలో పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా ఆగస్టు 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో పాటు యువకుల్లో అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి కలిగించేలా పలు కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

======================